క్లుప్తంగా

తప్పిపోయిన బాలిక తండ్రి చెంతకు



బాలికను తండ్రికి అప్పగిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శుక్రవారం ఉదయం తప్పిపోయిన ఒక బాలిక పోలీసుల చొరవతో తన తండ్రి చెంతకు చేరింది. వివరాల్లోకి వెళితే. తూర్పుగోదావరి జిల్లా రంగాపురానికి చెందిన భవానీ దీక్షాదారుడు చిన్నా కుటుంబ సమేతంగా ద్వారకాతిరుమల క్షేత్రానికి ఉదయం విచ్చేశారు. స్వామివారి దర్శనానికి వెళ్లే క్రమంలో తూర్పురాజగోపురం వద్ద తన కుమార్తె మహాలక్ష్మి తప్పిపోయింది. ఆ బాలిక ప్రధానరాజగోపురం మెట్ల మార్గం గుండా నడుచుకుంటూ కొండ కింద స్వామివారి కల్యాణ మండపం వద్దకు చేరింది. అక్కడ ఏడుస్తున్న బాలికను చూసిన కానిస్టేబుల్ చిరంజీవి, హోంగార్డు బాజీలు ఆరా తీశారు. బాలిక వద్ద ఉన్న చిన్న సెల్‌ఫోన్‌లోని నెంబర్లు ఆధారంగా తన తండ్రికి సమాచారం అందించారు. తండ్రి మండపం వద్దకు చేరుకోగా, బాలికను ఆయనకు అప్పగించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన వినాయక, లక్ష్మీదేవి విగ్రహాలు

లింగపాలెం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు, దాత కోటగిరి పాపారావు సహకారం రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన ఆలయంలో శుక్రవారం వినాయక స్వామి, లక్ష్మీదేవి విగ్రహాల ప్రతిష్ఠ వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుర్రాల కృష్ణకుమారి సత్యనారాయణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పొనగంటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

ద్వారకాతిరుమల: స్థానిక వెలుగు కార్యాలయాన్ని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి విజయరాజు శుక్రవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. జీఎస్టీ మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. గ్రామ, మండల సమాఖ్యల సమావేశాలు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

క్రీడా దుస్తుల బహూకరణ

జంగారెడ్డిగూడెం: పుట్లగట్లగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం 12 జతల క్రీడా దుస్తులు విజయవాడకు చెందిన గ్లోబల్ స్టార్ కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధులు అందజేశారని హెచ్‌ఎం చంద్రశేఖర్ తెలిపారు. సంస్థ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దుస్తులను క్రీడా విద్యార్థులకు పంపిణీ చేశారు.

దిక్సూచి ఉపాధ్యాయులు

టి.నరసాపురం: ప్రపంచాన్ని మార్చే దిక్సూచిలు ఉపాధ్యాయులు అని బంజారా బజరంగీ భేరీ సంఘం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ అన్నారు. కృష్ణాపురం గ్రామంలో బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన లావుడియా సాయి ప్రకాష్, భూక్యా ఆంజనేయులు, తేజావతు మౌనికలను శుక్రవారం ఘనంగా సన్మానించారు.

రీ సర్వే సభలు

టి.నరసాపురం: రైతులు రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ టీఎస్ సాయిబాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొర్రంపాలెం, తెడ్లం, శ్రీరామవరం గ్రామాల్లో ఈ నెల 3 నుంచి రీ సర్వే, ఫీల్డ్ వర్క్, గ్రౌండ్ ట్రూతింగ్ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

భగవద్గీత పారాయణ

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయంలో భగవద్గీతలోని 700 శ్లోకాలను ఆలయ కల్యాణ కళా వేదిక వద్ద చిన్నారులు ఆలపించారు. సాందీపని విద్యాకేంద్రం నిర్వాహకురాలు, గురువు నూరంపూడి నాగమణి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నూకాలమ్మ వెండి చీర తయారీకి దాతలు చిట్లూరి సుబ్బారావు కుటుంబ సభ్యులు రూ.15,116 లు, కె.రాధ కుటుంబ సభ్యులు రూ.15 వేలు విలువైన బంగారు రూపులు, ఆలయ అభివృద్ధికి పోలిన రాములు రూ.5 వేలు అందజేశారని ఆలయ కమిటీ చైర్మన్ రాజాన తెలిపారు.

మద్దిలో భక్తుల సందడి

జంగారెడ్డిగూడెం: శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయం శుక్రవారం భక్తుల హనుమన్నామస్మరణతో మార్మోగింది. భక్తులు, భవానీ దీక్షాదారులు బారులుదీరి స్వామివారిని దర్శించుకున్నారు. రాబోవు కార్తీక మాసోత్సవాలు సందర్భంగా శుక్రవారం రాట ముహూర్తం చేశామని ఆలయ ఈఓ చందన తెలిపారు.

నేత్రపర్వం.. కుంకుళ్లమ్మ రథోత్సవం

ద్వారకాతిరుమల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ దివ్య రథోత్సవం గురువారం రాత్రి నేత్రపర్వంగా శ్రీవారి దేవస్థానం నిర్వహించింది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, చిత్రవిచిత్ర వేషధారణలు, గరగనృత్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి రథం క్షేత్ర వీధుల్లో సంచరించింది. శక్తి వేషధారులు అలరించారు. తొలుత అధికారులు రథం వద్ద బలిహరణను సమర్పించారు. క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ, ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలో కొలువైన వాసవీ కన్యకాపరమేశ్వరి గురువారం శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఆళ్వార్ సదనంలో వేలాది మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు. శుక్రవారం కుంకుళ్లమ్మ దీక్షాదారులు ఆలయంలో ఇరుముడులు సమర్పించారు. శ్రీవారి క్షేత్రంలో చెరువు వీధిలోని మండపంలో ఉభయ దేవేరులతో శ్రీవారికి గురువారం రాత్రి శమీపూజ ఘనంగా నిర్వహించారు. జమ్మిచెట్టుకు పూజలు చేసి, హారతులిచ్చారు. భక్తులు తమ కోర్కెలను కాగితాలపై రాసి, జమ్మిచెట్టు కొమ్మలకు గుచ్చారు.



జమ్మిచెట్టుకు పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు



ద్వారకాతిరుమల : జమ్మిచెట్టుకు హారతి ఇస్తున్న అర్చకులు



టి.నరసాపురం : కనకదుర్గమ్మ ఊరేగింపు



బుట్టాయగూడెం : పాలకుంటలో బోనం, బతుకమ్మలను ఎత్తుకున్న గిరిజన మహిళలు



చింతలపూడి : రేచర్లలో ఊరేగింపు



జంగారెడ్డిగూడెం : గంగానమ్మ



కొయ్యలగూడెం : పొంగుటూరులో గణపతి విగ్రహం



జంగారెడ్డిగూడెం : నూకాలమ్మ



ద్వారకాతిరుమల : రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో..



చింతలపూడి : విశ్వనాథ మఠంలోని రాజరాజేశ్వరి



ద్వారకాతిరుమల : శ్రీవారికి శమీపూజ చేస్తున్న అర్చకులు



ద్వారకాతిరుమల : రథంలో కుంకుళ్లమ్మకు హారతులిస్తున్న అర్చకులు



కుక్కునూరు : శివాలయంలో శమీపూజ



జంగారెడ్డిగూడెం : ముత్యాలమ్మ



కొయ్యలగూడెం : పొంగుటూరులో ప్రతిష్ఠించి కనకదుర్గమ్మ విగ్రహం

ఏజెన్సీలో ఘనంగా విజయదశమి

బుట్టాయగూడెం: ఏజెన్సీలోని బుట్టాయగూడెం, దొరమామిడి, రెడ్డిగణపవరం, కేఆర్‌పురం గ్రామాల్లో గురువారం ఘనంగా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు, స్థానిక త్రిపుర సుందరీ కామేశ్వరస్వామివారి ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల మల్లికాసులు దంపతులు జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తాళ్లూరి ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కరాటం చిన్నరాయుడు, తదితరులు పాల్గొన్నారు. పడమర పాలకుంట గ్రామంలో గురువారం మహిళలు బతుకమ్మలతోపాటు బోనాలు ఎత్తుకుని గ్రామ శివారులో నిర్మించిన కనకదుర్గమ్మ, మల్లేశ్వర స్వామి, లక్ష్మీ నారాయణ స్వాముల గుడి వరకు ఊరేగింపు నిర్వహించారు. పలువురు మహిళలకు పూనకాలు వచ్చాయి. బోనాలు, బతుకమ్మలను కనకదుర్గమ్మ, మల్లేశ్వరస్వామి, లక్ష్మీ నారాయణ స్వాములకు సమర్పించారు. కుంకుమార్చన పూజలు చేశారు. బతుకమ్మలు ఆడారు. ఆలయ ధర్మకర్తలు ధర్ముల సీతారాములు, ధర్ముల బాబూరావు, నరసింహరావు, ఎంపీటీసీ యు. రత్నకుమారి పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీ దేవిగా దర్శనం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గ్రామదేవత గంగానమ్మ, నూకాలమ్మ, ముత్యాలమ్మ, వాసవీ మాత, కనకదుర్గమ్మవార్లు రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ముత్యాలమ్మకు స్వర్ణపుష్పార్చన, ఇక్షు ఖండార్చన, సాయంత్రం ఊంజల్ సేవ చేశారు. అన్నసమారాధనలు నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం చండీహోమం నిర్వహించారు. చండీహోమంతో దసరా శరన్నవరాత్రులు సంపూర్ణమైనట్టు ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విజయదశమి పూజలు

చింతలపూడి : విజయదశమి దసరా వేడుకలు గురు, శుక్రవారాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇళ్లు, దుకాణాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక విశ్వనాథ మఠంలో రాజరాజేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. స్థానిక షిర్డీ సాయిబాబా సేవా మందిర్ ఆధ్వర్యంలో స్వామివారి గురువారం క్షీరాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం పట్టణంలో పల్లకీ సేవ నిర్వహించారు. రేచర్ల రామాలయం సెంటర్‌లో గురువారం అమ్మవారిని మహిళలు ఊరేగించారు. బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఏటా బతుకమ్మ పండుగ చేసుకుంటామని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా ఊరేగింపు

టి.నరసాపురం: దసరా మహోత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మవారిని అంగరంగ వైభవంగా గ్రామంలో ఊరేగించారు. గురువారం రాత్రి ఆలయం వద్ద శమీ పూజ, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఆఖరి రోజు శనివారం భారీ సమారాధతో ఉత్సవాలు ముగియనున్నాయి. మహిళలు పాల్గొన్నారు.

కుక్కునూరు మండలంలో..

కుక్కునూరు: మండలంలో దసరా వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండపాల వద్ద అన్నదానం చేశారు. సాయంత్రం శమిపూజ, అమ్మవారి విగ్రహాలను ఊరేగించారు.

ముగిసిన ఉత్సవాలు

కొయ్యలగూడెం: దేవి శరన్నవరాత్రులు గురువారం ఘనంగా ముగిశాయి. కనకదుర్గమ్మ రాజరాజేశ్వరి అలంకరణతో పూజలు అందుకున్నారు. పొంగుటూరులో నిర్మించిన ఆలయంలో వరసిద్ధి వినాయక, విజయ దుర్గమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. రెండువేల మందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు. కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం, వై.జంక్షన్, కన్నాపురంలలో కనకదుర్గమ్మ ఆలయాల వద్ద భక్తులు జమ్మి వృక్షానికి పూజ చేశారు. బయ్యనగూడెంలో వెయ్యి మందికి పైగా మహిళలు తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బోణాలను శిరస్సులపై ధరించి గ్రామోత్సవం చేశారు. కొయ్యలగూడెంలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద శనివారం మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటుచేయనున్నారు.


పంటలపై నత్తల దాడి

ఆందోళనలో రైతులు

చింతలపూడి /లింగపాలెం : చింతలపూడి సబ్ డివిజన్‌లో ఆఫ్రికన్ నత్తలు పంటలపై దాడి చేస్తున్నాయి. రాత్రిపూట గుంపులుగా బయటికొచ్చే ఈ నత్తలు వరి, కూరగాయలు, మొక్కజొన్న, పూల మొక్కల ఆకులు, కాండాలు, పువ్వులు, పండ్లను తినేస్తున్నాయి. దీంతో మొక్కలు ఎండిపోయి చనిపోతున్నాయి. లక్షలాది రూపాయల నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నత్తలు ఉద్యాన పంటలలో ముఖ్యంగా బొప్పాయి, అరటి, జామ, కూరగాయలు, వక్క, కోకో, పామాయిల్ తోటలపై ఆశిస్తున్నాయి. ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఈ నత్తల దాడి ఎక్కువగా ఉంది. పొడవుగా ఉండే గుల్ల చెక్కుతో (షెల్) పెద్ద పరిమాణంలో ఈ నత్తలు పెరుగుతాయి. రాత్రిపూట బయటికి వచ్చి పంటలను తింటాయి. ఆఫ్రికన్ నత్తల దాడి కొనసాగితే పంటలతో పాటు ఆహార భద్రతకూ ముప్పు వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



లింగపాలెంలో నత్తలు ఆశించిన బొప్పాయి



చింతలపూడి సబ్‌డివిజన్‌లో కొబ్బరి తోటలో..

నివారణ చర్యలు

ఆఫ్రికన్ నత్తల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను చింతలపూడి ఉద్యానవన శాఖ అధికారి ఎండీ షఫీయా పార్వీన్ మాటల్లో ఇలా.. ఈ నత్తలు నెలకు 100 నుంచి 400 గుడ్లు పెడతాయి. అంటే సంవత్సరానికి 1000 నుంచి 1200 పిల్లలు పెడతాయి. తోటలను పరిశుభ్రంగా, పొడిగా ఉంచాలి. రైతులు చేతికి గ్లౌజులు వేసుకొని కనిపించిన నత్తలను ఎప్పటికప్పుడు ఏరి ఉప్పు నీటి ద్రావణంలో కలపాలి. నత్తల సత్వర నివారణకు చీలేటెడ్ కాపర్ 3 గ్రాములు లీటర్ నీటిలో లేదా ఫెర్రోమేగ్ (ఐరన్ + మెగ్నీషియం + సల్ఫేర్) 3 గ్రాములు / లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే రెండు నిమిషాల్లో 95 శాతం నత్తలు కిందపడి చనిపోతాయి. కిందపడిన నత్తలను సేకరించి 5 కేజీల ఉప్పును 4 లీటర్ నీటిలో కలిపిన ద్రావణంలో వేస్తే అవి పూర్తిగా చనిపోతాయి. కాపర్ వల్ల నత్తలకు విద్యుత్ షాక్ తగిలినట్టై అందులోని సలైమ్ బయటకొస్తుంది. ఫెర్రోమేగ్ మొక్కల్లో పూత, పెరుగుదలకు ఉపయోగపడుతుంది.



ఎండీ షఫీయా పార్వీన్
ఉద్యానవన శాఖ అధికారిణి

గాంధీ విగ్రహావిష్కరణ

కొయ్యలగూడెం: బయ్యనగూడెం గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం నేత కంభంపాటి బుజ్జిబాబు ఆధ్వర్యంలో ఎంపీపీ స్కూల్ (మెయిన్) ఎదుట ఉన్న విగ్రహావిష్కరణకు ప్రజాప్రతినిధులు ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు హాజరయ్యారు. మహాత్ముని ఆశయాలను గుర్తుచేశారు. బుజ్జిబాబును పలువురు అభినందించారు. మహాత్మునికి ఘనంగా నివాళులర్పించారు. గవరవరంలో, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కె.కిరణ్ కుమార్, కన్నాపురం, లైబ్రరీల్లోని గాంధీ విగ్రహాల వద్ద జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ త్యాగాలను స్మరిస్తూ, గొప్పతనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్లు చిటికెల అచ్యుతరామయ్య, నంబూరి రాజు, వలవల తాతాజీ, కోఆప్షన్ వెంప ఐజాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన చిన్న, మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.



బయ్యన్నగూడెంలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంచాయతీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోండి

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురంలో పంచాయతీ భవనం నిర్మించాలని గ్రామస్తులు దాఖలు చేసిన రిట్ పిటిషన్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అంగీకరించింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ కమీషనర్, జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారిని హైకోర్టు ఆదేశించినట్లు తెలిపారు. 2020లో కోర్టు కేసు కారణంగా కుంతలగూడెం పంచాయతీ కార్యాలయం కనకాద్రిపురంలో ఏర్పాటు చేసినట్లు ఆ గ్రామ ప్రజలు కోర్టు దృష్టికి తెచ్చారు. కనకాద్రిపురం గ్రామంలో పంచాయతీ భవనం నిర్మాణం కోసం పంచాయతీ తీర్మానం చేసిందని, సర్వే నెంబర్ 10 లో 15 సెంట్ల స్థలం కేటాయిస్తూ గ్రామ కార్యదర్శి ప్రొసీడింగ్స్ ఇచ్చారని కోర్టుకు దస్త్రాలు సమర్పించారు. దీనిపై ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కోర్టు ఆదేశాలను పరిశీలించాల్సి ఉందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం / వేలేరుపాడు : సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, ట్రీ కటింగ్ ల నిమిత్తం ఈ నెల 4న శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. టి.నరసాపురం, బండివారిగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలో, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అన్ని గ్రామాలకు, జీలుగుమిల్లి మండలం పి.నారాయణపురం, రాచన్నగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

- **చింతలపూడి:** సీతానగరం, రేచర్ల, వెలగలపల్లి సబ్‌స్టేషన్లు, తిమ్మిరెడ్డిపల్లి, నాగిరెడ్డిగూడెం ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.
- **కొయ్యలగూడెం:** బయ్యనగూడెం, సీతంపేట, నరసన్నపాలెం, సరిపల్లి, రామానుజపురం, వేదాంతపురం గ్రామాల్లో వ్యవసాయ, గృహ సముదాయాలకు, బోడిగూడెం, శ్రీరంగపట్నం, మంగపతిదేవిపేట గ్రామాల్లోని అన్ని కేటగిరిల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఎన్‌వీ రామారావు తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

కొయ్యలగూడెం: చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0 పథకాలపై స్థానిక చాంబర్ ఆఫ్ భవనంలో వ్యాపారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథులుగా జీఎస్టీ కమిషనర్ రసజ్ఞ, మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ హాజరయ్యారు. జీఎస్టీ సావనీర్ పుస్తకాలను విడుదల చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మద్దుమోహన్, సెక్రెటరీ గొలిశెట్టి శ్రీనివాస్, క్యాషియర్ కర్పూరపు సత్యనారాయణ, కిరణా సంఘం అధ్యక్షులు కంభంపాటి రాంబాబు, కొల్లూరు శ్రీనివాస్, గడ్డం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు వ్యాపారులు

ఆటల పోటీలు

లింగపాలెం: ఎస్‌జీఎఫ్‌ఐ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈ నెల 8, 9 తేదీల్లో శింగగూడెం జెడ్పీ హైస్కూల్‌లో కోకో, కబడ్డీ, వాలీబాల్, చెస్, షటిల్, బ్యాడ్మింటిన్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు కోఆర్డినేటర్ సీహెచ్ ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

నిలవనున్న సేవలు

కుక్కునూరు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌ను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో సాంకేతికంగా విలీనం చేసే ప్రక్రియలో భాగంగా ఈ నెల 4వ తేదీ సాయంత్రం 6 నుంచి 7వ తేదీ ఉదయం 10 గంటల వరకు బ్యాంకు సేవలు తాత్కాలికంగా నిలవనున్నట్టు అధికారులు తెలిపారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన

ద్వారకాతిరుమల: మండలంలోని కొమ్మర గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించారని, తనకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఈ సభను నిర్వహించారని స్థానిక ఎంపీటీసీ మానుకొండ కన్నయ్య విలేకర్లకు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమానికి ఒక ప్రజాప్రతినిధిని ఆహ్వానించకుండా గ్రామ సభ నిర్వహించిన అధికారుల తీరును ఆయన తప్పుపట్టారు. తనను అవమానించారని కన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తాను వైఎస్సార్‌సీపీకి చెందిన వాడిని కావడంతో అధికారులు ఇలా చేశారని ధ్వజమెత్తారు.

యండపల్లిలో పోలీసుల పల్లెనిద్ర

చింతలపూడి : ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు మండలంలోని యండపల్లి గ్రామంలో శుక్రవారం సీఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై కె.సతీష్ కుమార్ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నివారణపై పలు సూచనలు చేశారు. వీఆర్‌ఓ కృష్ణ, సర్పంచ్ యడ్ల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమం

లింగపాలెం: మండలంలో ములగలంపాడు, ముడిచెర్ల గ్రామాల్లో భూముల రీసర్వే కార్యక్రమాన్ని శుక్రవారం రెవెన్యూ శాఖ ప్రారంభించింది. గ్రామసభల్లో రైతులకు రీసర్వేపై తహసీల్దార్ నజీముల్లాషా అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు రావి రమాదేవి, ఈనుగంటి రాజేష్ బాబు, డీటీ నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.